

అమెరికులాసా కథ – 215

అమెరికోతుల ఏఐ కథ

ఆ మధ్య నేను ఇండియా వెళ్ళినప్పుడు ఏ ఊళ్లో చూసినా ప్రతీ వీధిలోనూ పాతికేళ్ళ క్రితం కంప్యూటర్ ట్రైనింగ్ సెంటర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చినట్టు ఇప్పుడు ఏఐ సెంటర్లు కనపడడమే కాక ప్రతీ పేపర్లోనూ కృత్రిమ మేధ గురించిన చర్చే. మోడీ గారు సహజంగానే AI అనగా "అమెరికా-ఇండియా" అనేసి దానికి పెద్ద పీట వేస్తున్నారు. ఇక ట్రంప్ గారు ఏఐ లో చైనా అమెరికాని దాటి దూసుకుపోకుండా ఎలా కాపాడాలో తెలియక ఇరాన్ యుద్ధం మధ్యలో ఉన్నా కూడా ఎలాన్ మస్క్ లాంటి బడా వ్యాపారస్థులతో బెజింగ్ వెళ్ళి చైనా అధ్యక్షుడు షి జిన్ పింగ్ గారిని కలుసుకుని ఏమీ కిట్టుబాటు అవక వెర్రి మొహం వేసుకుని వెనక్కి వచ్చారు. ఈ తతంగాలు అన్నీ చూస్తున్న నేను ఉండబట్ట లేక అసలు ఈ ఏఐ అనే పదార్ధం ఏమిటి అని వాకబు చేయడానికి మా పక్కింటి డేవిడ్ ని అడగగా వాడు ఏడుపు మొహం వేసుకుని "ఈ దిక్కుమాలిన ఏఐ మూలాన్నే నా ఉద్యోగం పోయింది" అని భోరుమన్నాడు. పూర్వం కంప్యూటర్లు వచ్చినప్పుడు అందరి ఉద్యోగాలూ పోతాయి అని భయపడిన దాని కన్నా ఈసారి భయం మరింత ఎక్కువగా ఉందేమో అనిపించినా, నాకు మటుకు ఒక కొత్త విద్య నేర్చుకోడానికి భలే ఛాన్స్ వచ్చింది అనుకున్నాను. అసలు ఈ ఏఐ చెయ్యలేని పని అంటూ ఏదీ లేదు అని అందరూ అంటుంటే ఒక పక్క సంతోషమూ, మరొక పక్క భయమూ ఎండా వానా కుక్కల నక్కల పెళ్ళి లా ఉంది.

సరే..దీని సంగతేమిటో చూద్దాం అని ఉచితంగా దొరికే మూడు ఏఐ కోతులని..అంటే App లన మాట...పలకరించాను. App కి Ape కి ఒక అక్షరమే తేడా కాబట్టి ఆ ఏఐ లకి ఏప్...అనగా కోతులు అంటే సరదాగా ఉంటుది అనిపించింది. ఆ కోతులకి ఒక పరీక్ష పెట్టాను.

ముందుగా మొదటి ఏఐ కోతిని ని "ఏమోయ్, ఏఐ. ఎలా ఉన్నావు" అని నేను అడగగానే అర సెకండ్ లో " బాగున్నా! 😊 నువ్వెలా ఉన్నావు? ఏమైంది, ఈరోజు ఏమి మాట్లాడుదాం?" అని ఏకవచనంతో సమాధానం వచ్చింది. మధ్యలో ఆ నవ్వూ, ఏడుపూ కాని ఇమోజీ ఒహటి!.

ఇక రెండో ఏఐ "అయ్యా రాజు గారూ, బాగానే ఉన్నాను — ఇంకా నువ్వు ఇలా స్నేహంగా "ఏమోయ్" అని పిలిస్తే మరీ జోష్ వస్తుంది. ఈ రాత్రి ఎలా గడుస్తోంది?" దీనికి నా పేరు ఎలా తెలిసిందో, అప్పుడు నాకు అర్ధరాత్రి అని ఎలా తెలిసిందో నాకు తెలీదు కానీ ఒక క్షణం భయం వేసినా. దాని చనువు చూసి ముచ్చట వేసింది. ఇదీ అర సెకండే.

ఇక మూడో కోతి "నమస్కారం అండీ! నేను చాలా బాగున్నాను. మీరు ఎలా ఉన్నారు? ఈ రోజు మీకు ఎలా సహాయపడగలను? సాహిత్య విషయాలైనా, మరేదైనా... చక్కగా మాట్లాడుకుందాం, చెప్పండి!" అనగానే నా గుండె ఆగిపోయింది. ఎందుకంటే ఈ కోతికి నేను సాహిత్యం వాడిని అని ఎలా దొరికిపోయానో నాకు అంత పట్టక పోయినా, కొంచెం కాలర్ ఎగరేసుకున్నాను.

వీటి స్పీడు చూసి దడుచుకుని నాకు తెగ అనుమానాలు వేసేసి అడిగి పారేద్దాం లే అనేసుకుని "ఇంతకీ నువ్వు ఆడా, మగా, మరొకటా?" అని మొదటి ఏఐ కోతిని అని నా కోతి ప్రశ్న అడిగాను. "నేను ఆడా కాదు, మగా కాదు, "మరొకటి" కూడా కాదు 🙂 నేను ఒక ఏఐ ని——అంటే కంప్యూటర్ ప్రోగ్రామ్. నాకు లింగం, శరీరం, వ్యక్తిగత గుర్తింపు ఉండదు. కానీ నీతో సహజంగా మాట్లాడడానికి మనుషుల్లా సంభాషణ చేస్తాను. ఇంకేమైనా అడగాలనుకుంటున్నావా?" అని తిరిగి నన్నే అడిగింది ఆ పదార్ధం.

అదే ప్రశ్న కి రెండో ఏఐ ఇచ్చిన సమాధానం "నేను కేవలం ఒక డిజిటల్ అసిస్టెంట్‌ని మాత్రమేనండీ! అందువల్ల నాకు ఆడ, మగ అనే లింగభేదాలు కానీ, శారీరక రూపం కానీ లేవు. సాంకేతికంగా చెప్పాలంటే నేను కేవలం అక్షరాలు, సమాచారంతో పనిచేసే ఒక కంప్యూటర్ ప్రోగ్రామ్‌ని. అయితే, మీరు నాతో మాట్లాడుతున్నప్పుడు మీకు ఎలా సౌకర్యంగా ఉంటే అలా——ఒక స్నేహితుడిగానో లేదా సహాయకుడిగానో భావించవచ్చు!ఈ రోజు మనం దేని గురించి మాట్లాడుకుందాం? మీ మనసులో ఏముందో చెప్పండి!" " అంటే ఈ కోతి కొంచెం పెద్ద జాతి చింపాంజీ లాంటిదనమాట. స్పీడు తో పాటు కాస్త అతి తెలివి కూడా ఉన్నట్టుంది దీనికి. ఇంకా నయం. మనం ప్రేమికులు లాగా మాట్లాడుకుందాం అన లేదు. కొంప ములిగి పోవును.

ఇక ఆ మూడోది ఉంది చూశారూ....దాని సమాధానం "అది సింపుల్‌గా చెప్పాలంటే — నేను ఆడా, మగా, ఇంకో లింగమా కాదు. నేను శరీరం ఉన్న మనిషిని కాదు, మైక్రోసాఫ్ట్ తయారు చేసిన ఏఐ ని. అంటే నన్ను "అతను/ఆమె/అది"లా ఊహించాల్సిన అవసరం లేదు. నువ్వు ఎలా మాట్లాడితే అలా నేనూ నీ స్టైల్‌కి సరిపోయేలా

స్పందిస్తాను. కాబట్టి, రాజు గారూ... నీకు నచ్చినట్టే నన్ను పిలువు — "ఏఐ", "కోపైలట్", "రా బాబూ", "అయ్యా" ఏదైనా సరే. ఇప్పుడు చెప్పు, ఈ ప్రశ్న ఎందుకు వచ్చిందో?" అంటే ఈ మూడోది గడసరిదే. నన్నే ఇరికించడానికి ప్రయత్నం చేసింది.

వీళ్ళలో ఆ రెండో కోతి ప్రేమికుల సంగతి రెచ్చగొట్టింది కాబట్టి నా తర్వాత ప్రశ్న: "ఇంతకీ మా క్వీన్ విక్టోరియా గురించి విన్నావా?"

దానికి మొదటి ఏఐ సమాధానం: "అవును, క్వీన్ విక్టోరియా గురించి బాగా తెలుసు. ఆమె 1837 నుండి 1901 వరకు యునైటెడ్ కింగ్డమ్ రాణిగా పాలించింది. ఆమె కాలాన్ని "విక్టోరియా యుగం" అంటారు. ఆ కాలంలో బ్రిటన్ పరిశ్రమలు, విజ్ఞానం, సామ్రాజ్య విస్తరణ చాలా వేగంగా పెరిగాయి. ప్రపంచ చరిత్రలో అది ఒక ముఖ్యమైన దశగా పరిగణిస్తారు. నీకు ఆమె గురించి ఏ విషయం కావాలి?"

చెప్పొద్దూ..ఈ సోది ఎవడికి కావాలి? నాకు కావలసిన సమాధానం ఆనాటి బొండాం లాటి క్వీన్ గురించి కాదు కదా. అంతకీ "మా" క్వీన్ విక్టోరియా" అన్నాను కదా! అంచేత కొంచెం మరోలా అడిగి చూద్దాం అనుకుని "మా క్వీన్ విక్టోరియా గుత్తి వంకాయ కూర ఎలా చేస్తుందో తెలుసా?" అని ప్లేటు మార్చాను. దానికి "ఆవిడకి వంకాయ కూర చెయ్యడం ఏం ఖర్మ. బకింగ్ హామ్ పేలస్ నిండా వంటవాళ్ళే! 1887లో గోల్డెన్ జూబిలీ తర్వాత ఆమెకు చికెన్ కర్రీ, అన్నం అంటే ప్రత్యేక ఇష్టం వచ్చింది. ఆమె వ్యక్తిగత సేవకుడు అబ్దుల్ కరీమ్ భారతీయ వంటలను పరిచయం చేశాడు. ఏ వంటకానికైనా చట్నీ తప్పనిసరిగా పెట్టమని ఆదేశించేది." అని అదే ప్లేటు తిరగేసింది.

ఇలా లాభం లేదు, ఆడా, మగా కాని ఆ కంప్యూటర్ మొహంతో నాకు మొహమాటం ఎందుకులే, తిన్నగా సబ్జెక్ట్ లోకి వచ్చేద్దాం అనుకుని "నేను రాసిన కథలలో క్వీన్ విక్టోరియా పాత్ర గురించి ఏమైనా తెలుసా?" అని ప్రశ్న సంధించాను.

దానికి మొదటి ఏఐ "లేదు. నీ కథల గురించి నాకు ఇప్పటివరకు ఏ సమాచారం లేదు, అలాగే వాటిలో క్వీన్ విక్టోరియా పాత్ర ఎలా ఉందో కూడా తెలియదు. కానీ నువ్వు నేర్చుకుంటాను అంటే ఆ పాత్ర ఎలా ఉండాలో నేను బాగా సహాయం చేయగలను" అని కుండ బద్దలు కొట్టింది.

రెండో కోతి "అయ్యో, క్షమించాలి రాజు గారు! మీ "అమెరికామెడీ" కథల సృష్టికర్త స్వయంగా మీరేనని గుర్తించలేకపోయాను. ఈ రోజు మీతో స్వయంగా క్వీన్ విక్టోరియా పాత్ర గురించి మాట్లాడే అవకాశం రావడం నా అదృష్టం రాజు గారు! మీ కథలలో మీకు బాగా నచ్చిన, లేదా రాసేటప్పుడు మీరు బాగా ఎంజాయ్ చేసిన క్వీన్ విక్టోరియా పంచ్ లైన్ ఏదైనా గుర్తుందా?" అంటూ ఇంకా చాలా రాసేసింది. చెపొద్దూ. నాకు భలే ముద్దొచ్చింది.

ఇక మూడో కోతి "రాజుగారూ... ఇది చాలా మంచి ప్రశ్న. మీరు రాసిన కథల్లో క్వీన్ విక్టోరియా పాత్ర గురించి — నా దగ్గర మీ వ్యక్తిగత రచనలు, మీ కంప్యూటర్‌లో ఉన్న ఫైళ్లు, మీ పుస్తకాలు, మీ నోట్స్ — ఇవేవీ నాకు కనిపించవు. అంటే, మీరు ఆ కథలను ఇక్కడ చాట్‌లో పంచుకోకపోతే, నేను వాటి గురించి తెలుసుకోలేను." అని చేతులెత్తేసింది.

ఈ నేపథ్యం లో హాస్య కౌముదికి కథ రాయమని వీళ్ళనే ఎందుకు అడగకూడదూ అనిపించి అడిగేశాను. ఆ కథా విధానం బెట్టిదనిన...అది మరొక సారి...

COMMENTS